

# రెడీగా బీఆర్ఎస్ ప్రచార రథాలు

ఖానాపూర్, అక్టోబర్ 18 : ఎన్నికల ప్రచారం కోసం ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి భూక్యా జాన్సన్ రాథోడ్ నాయక్ ప్రచార రథాలను సిద్ధం చేశారు. ఈ నెల 15న సీఎం కేసీఆర్ ఆయనకు బీఫామ్ అందించారు. బీఆర్ఎస్ శ్రేణులు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమయత్తమవుతున్నారు. ప్రచారం రథాలపై బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌తో పాటు కేటీఆర్ ఫొటోలు, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలను ఫ్లెక్సీలపై ఉంచారు. రెండు రోజుల్లో బాదనకుర్తి గ్రామం శ్రీరాజ రాజేశ్వరాలయం నుంచి పార్టీ ప్రచారం ప్రారంభించనున్నట్లు మండల నాయకులు పేర్కొన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ నివాసంలో ప్రచారానికి సిద్ధంగా ఉన్న ప్రచార రథాలు

# వాయిదా పడిన మండల సమావేశం

దస్తురాబాద్,అక్టోబర్ 18 : ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధనల ప్రకారం మండల సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీపీ సింగరి కిషన్ తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. కానీ మండల సర్వ సభ్య సమావేశానికి 21 శాఖల అధికారులు రావాల్సింది ఉండగా కేవలం 3,4 శాఖాల అధికారులు మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. 13 మంది సర్పంచ్‌లకు ఒక మహి ళా సర్పంచ్ సమావేశానికి వచ్చింది. ఎంపీటీసీలు దుర్గం సునీత, భాగ్యలక్ష్మి, సర్పంచ్ నిమ్మతోట రాజమణి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫిక్, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ అప్పని రాజు, ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సింగరి కిషన్


ఇంద్రవెల్లి : రాధాకృష్ణ మందిరం ఆవరణలో ఐదుపడుగల పాముపై కొలువుదీరిన దుర్గామాత

# ఘనంగా దుర్గాదేవి నవరాత్రోత్సవాలు

కడెం, అక్టోబర్ 18 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రామాలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాగా, బుధవారం మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. బుధవారం కడెంతో పాటు, సమీప గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

**ఖానాపూర్‌లో..**

ఖానాపూర్, అక్టోబర్ 18 : ఖానాపూర్‌లోని దుర్గామాత మండపాల వద్ద మహిళలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పట్ట వస్త్రాలు, గాజులు, ఒడి బియ్యం సమర్పించారు. శ్రీరాంనగర్‌లో అర్చకుడు కీర్తి రాఘవశర్మ శివాజీనగర్‌లో నిమ్మగడ్డ సందీప్ శర్మ, అంబేద్కర్‌నగర్‌లో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**ఇంద్రవెల్లిలో..**

ఇంద్రవెల్లి, అక్టోబర్ 18 : మండలకేంద్రంతో పాటు ముత్నూర్, దేవాపూర్, శంకర్‌గూడ, ధనోరా (బీ), గౌరాపూర్, అందునాయక్‌తండా, ఎస్టీ గోండ్‌గూడ, ప్రధాన్‌గూడ, బజార్‌గల్లీ, రాధాకృష్ణ మందిరం గ్రామాల్లో దుర్గాదేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారిని దర్శించుకున్నారు. ముత్నూర్, మండల కేంద్రంలోని రాధాకృష్ణ మందిరం, ఎస్టీగోండ్‌గూడ, అందునాయక్‌తండా గ్రామాల్లో దుర్గాదేవీ మండపాల వద్ద ఆధ్మాత్మిక కార్యక్రమాలతోపాటు మహిళలు దాండియా ఆడుతున్నారు.

# ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించండి



పెంబి : మందపల్లిలో అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు



దస్తురాబాద్ : అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కెశెట్టి శ్రీనివాస్

దస్తురాబాద్, అక్టోబర్ 18 : విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో బిల్లులను చెల్లించాలని ఖానాపూర్ ఏడీఏ కెశెట్టి శ్రీనివాస్ కోరారు. గొడిసెర్యాల గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రజలకు విద్యుత్ బిల్లులను ఆన్ లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా విద్యుత్ బిల్లును చెల్లింపు సదుపాయాన్ని టీఎస్ఎన్‌పీడీఎస్ఎల్ అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. సబ్ ఇంజినీర్ నాగరాజు, సిబ్బంది సదానందం,రాజు, నాయకులు, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

**పెంబిలో..**

పెంబి, అక్టోబర్ 18 : ఆన్‌లైన్‌లో నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏఈ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మందపల్లి గ్రామంలో ఆన్‌లైన్‌లలో విద్యుత్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంతో పాటు ఇతర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చన్నారు. కార్యక్రమమలో ఏడీఈ శ్రీనివాస్, లైన్ మెన్ సత్యం, పంచాయతీ కార్యదర్శి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**కడెంలో..**

కడెం, అక్టోబర్ 18 : మండల కేంద్రంతో పాటు, పాండ్వాపూర్‌లో వినియోగదారులకు విద్యుత్ బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పించారు. అంతకు ముందు ఆన్‌లైన్ బిల్లు చెల్లింపునకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ సుమన్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారులు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించడం వల్ల సమయం ఆదా అవుతుందని, పేటీఎం, గుగుల్‌పే, ఫోన్‌పే, టీవ్యాలెట్, బీంయూపీఐ ద్వారా, అలాగే క్రెడిట్, డెబిట్, ఆన్‌లైన్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా, టీఎస్పీఎన్‌డీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా  బిల్లులను చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ సర్పంచ్‌లు కొండాపురం అనూషలక్ష్మన్, పిన్నం మల్లవ్వమల్లేశ్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకుడు భుక్యా రాజేశ్ నాయక్, తదితరులున్నారు.

# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో విపక్షాల మైండ్ బ్లాక్


పార్డి(బీ)లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కుభీర్, అక్టోబర్ 18 : సీఎం కేసీఆర్ విపక్షాలకు మైండ్ బ్లాక్ అయ్యేలా మ్యానిఫెస్టోను రూపొందించి పేదలకు మరింత చేరువయ్యారని బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్ పేర్కొన్నారు. పార్డి(బీ) గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు 40 రోజులు అవిశ్రాంతంగా కష్టపడి మన పథకాలను ఇంటింటికీ వివరించాలని కోరారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ముథోల్ గడ్డపై ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మూడోసారి గెలువడం ఖాయమైపోయిందని పేర్కొన్నారు. పేద ప్రజల అండదండలు ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాలకు అందించిన ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే దక్కు తుందని వివరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ తమ కష్ట సుఖలను వివరించారు. సమన్వయంతో పని చేసి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని గెలిపించుకుని సీఎం కేసీఆర్‌కు కానుక అందిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుకారాం, నాయకులు ఎకీనొద్దీన్, శేరి సురేశ్, మిలింద్, సాయినాథ్, వడ్ల లక్ష్మణ్, పార్టీ కార్యకర్తలు వందలాది మంది పాల్గొన్నారు.

# వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేయవచ్చు


మాట్లాడుతున్న తహసీల్దార్ పరిమల్ భౌమిక్

ఖానాపూర్ టౌన్, అక్టోబర్18 : వచ్చే నెల 30న నిర్వహించనున్న ఎన్నికల్లో 80 ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తహసీల్దార్ పరిమాళ్ భౌమిక్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రంలో వారం ముందుగానే డీ -12 ఫారం అందజేస్తున్నదని పేర్కొన్నారు. బీఎల్వోలు, అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్‌కు సన్మానం

పెంబి, అక్టోబర్ 18 : మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉత్తమ సేవలందించిన నిర్మల్ ప్రభుత్వ దవాఖాన ఆర్ఎంవో వేణుగోపా లకృష్ణను బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రజినీకాంత్ శాలువాతో సన్మానించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కార్యాలయం ప్రారంభం

దస్తురాబాద్, అక్టోబర్ 18 : మండల కేంద్రంలో గురువారం ఉదయం 7 గంటలకు ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యా లయాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్ పేర్కొన్నారు.

# కేంద్రం కార్మిక చట్టాలను కాలరాస్తున్నది


మాట్లాడుతున్న బొమ్మెన సురేశ్

దస్తురాబాద్, అక్టోబర్ 18 : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తున్నది సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందని, విద్యుత్ సవరణ బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు నారపాక నర్సయ్య, మండల అధ్యక్షుడు పోతు శ్రీనివాస్, నాయకులు నర్సయ్య, విజయ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.